క్లుప్తంగా

వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న జీసీడీవో బేగం

పద్మనాభం: వృత్తి విద్యను అభ్యసించడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని సమగ్ర శిక్షా జిల్లా జీసీడీవో కాలేషా బేగం అన్నారు. మండలంలోని రేవిడిలో 30 మంది విద్యార్థులకు స్థానిక ఆటో మొబైల్ షాపు, ఫ్యాషన్ టైలర్ షాపులో నాలుగు రోజుల నుంచి జరుగుతున్న వృత్తి విద్య ఇంటర్న్‌షిప్ తరగతులను ఆమె సందర్శించారు. విద్యార్థులకు రాత సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వృతి విద్య జిల్లా కో–ఆర్డినేటర్ రిషికేష్, హెచ్ఎం వి.శంకరరావు, వృత్తి విద్య శిక్షకులు బి.కిరణ్ కుమార్, కె.మాధవి పాల్గొన్నారు.

ఎండాడ ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించిన సీపీ



రికార్డులు పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

మధురవాడ: ఎండాడ ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయాన్ని విశాఖ నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శనివారం అర్ధరాత్రి సందర్శించారు. నగరంలో వివిధ పోలీసు స్టేషన్‌లు, ప్రాంతాలు ఆకస్మికంగా సందర్శిస్తూ వస్తున్న ఆయన అర్ధరాత్రి సమయంలో ఇక్కడకు వచ్చి తనిఖీలు చేశారు. అధికారులు, సిబ్బంది విధులను సమీక్షించి సూచనలు చేశారు. జోన్ పరిధిలోని ట్రాఫిక్ సమస్యలు, కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

మాజీ సైనికుల నూతన కార్యవర్గం



భీమిలి రోడ్డులో సమావేశమైన మాజీ సైనికులు

తగరపువలస: స్థానిక శ్రీచైతన్య మాజీ సైనికుల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం సాయంత్రం భీమిలి రోడ్డులో సమావేశమైంది. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కొయ్య గురయ్యారెడ్డిని ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా మ్యాన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చేట్ల గురుమూర్తి రెడ్డి, కార్యదర్శిగా పీఎస్ రావు, కోశాధికారిగా చేట్ల సూరిబాబు, సహాయ కార్యదర్శిగా, కందివలస దుర్గారావు, సలహాదారులుగా మేకల శ్రీనివాస్, తాటిపూడి శ్రీనివాసరావు, శీరపు వేలుబాబు సభ్యులుగా కొయ్య అప్పలనాయుడు, జీరు ప్రసాదరెడ్డి, సీహెచ్ అప్పలరెడ్డి, చిల్ల గోవిందరెడ్డి, ఉప్పాడ అప్పలరెడ్డి, చేట్ల రమణరెడ్డి తదితరులను ఎన్నుకొన్నారు.

అలరించిన జానపద, కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

పీఎంపాలెం: దసారా సంబరాలలో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి ,జానపద నృత్య ప్రదర్శన అలరించింది. నగరంలోని కిరణ్మయి నృత్య నికేతన్ విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. జానపద నృత్యాలలో ఎంత చక్కనివాడే ..అయిలారే.. నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాకారులు కున్విత, శ్రావ్య, లక్ష్మీ దీక్షిత, రిషిత, హిమబిందు, మోక్షిత, జాన్వి, లహరి, కీర్తి, చైత్ర పాల్గొనగా.. జీవన కిరణ్మయి నృత్య దర్శకత్వం వహించారు.

అమ్మో.. డెవిల్ ట్రీ

పచ్చని చెట్లు ప్రాణాధారమంటారు.. వాయు కాలుష్యాన్ని నియంత్రిస్తూ.. ప్రాణవాయువును అందిస్తూ.. అనేక విధాలుగా మనుషుల జీవన విధానంలో భాగమైన ఆ చెట్ల వల్లే.. ఇప్పుడు నష్టం వాటిల్లుతోంది అంటున్నారు బాధితులు. ప్రాణాధారమైన చెట్లే.. ప్రాణాలు తీస్తున్నాయని ఆరోపిస్తున్నారు. ఇంతకీ ఏమా చెట్లు.. వాటి వల్ల కలిగే దుష్పలితాలు ఏంటీ..? భీమిలి నియోజకవర్గ వాసులను అంతలా కలవరపెడుతున్న ఆ చెట్లలో ఏముంది. –మధురవాడ



ఐటీ సెజ్ సమీపంలోని ఉడా హరిత వద్ద పూలతో ఉన్న ఏడాకుల చెట్లు

- ఏడాకుల చెట్టు పువ్వులతో అవస్థలు
- మధురవాడలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి
- శ్వాసకోశ వ్యాధులతో సతమతం

ఆ చెట్టు పేరు ఏడాకులు. దెయ్యంచెట్టు.. డెవిల్ ట్రీ అని కూడా పిలుస్తారు. పచ్చగా ఉంటూనే పచ్చని జీవితాలను నాశనం చేస్తుంది. తెల్లని పువ్వులతో ఆకర్షిస్తూనే ఊపిరి తీసేస్తుంది. నివాసాలు మధ్యలో దట్టమైన పుష్పాలతో ఉన్న ఏడాకుల చెట్లు వెద జల్లుతున్న వెర్రీ..వికారంతో కూడిన వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పూలు నుంచి వచ్చే దుర్వాసన, గాలికి ఎగిరే పుప్పొడి రేణువుల పీల్చడం వలన ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని వైద్యులు చెపుతున్నారు.

విశాఖకు ఎలా వచ్చాయి?

2014లో హుద్హుద్ తుపాను విశాఖ నగరంలో విధ్వంసం సృష్టించింది. ఆ విధ్వంసానికి నగరంలోని పచ్చదనం 70 నుంచి 80 శాతం మాయమైంది. తిరిగి మళ్లీ నగరంలో పచ్చదనం పెంచి పర్యావరణాన్ని సమతుల్యం చేసేందుకు ప్రభుత్వం వివిధ రకాలైన మొక్కలను తెచ్చి పెంచడం ప్రారంభించింది. అలా వచ్చిందే ఈ డెవిల్ ట్రీ. అటవీ శాఖ, వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో నగరమంతా ఆ మొక్కలను నాటారు. ఈ చెట్లకు అక్టోబరు నుంచి ఫిబ్రవరి మధ్యలో భారీగా పూత రావడంతో అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. నిత్యం వాసన పీల్చడంతో వికారం, తలనొప్పి, శ్వాస ఇబ్బందులొస్తున్నాయని పలువురు చెబుతున్నారు.



మధురవాడలో వందలాది చెట్లు

మధురవాడ జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల్లోని కొమ్మాది, శివ శక్తినగర్, మిథిలాపురి వుడా కాలనీ, పీఎంపాలెం, సాయి ప్రియగార్డెన్, మారికవలస జంక్షన్–తిమ్మాపురం తదితర మాస్టర్ ప్లాన్ రోడ్డులతో పాటు ఇతర రోడ్లు, చంద్రంపాలెం, మిథిలాపురి వుడా కాలనీ, పీఎంపాలెం తదితర ప్రాంతాలలో వందల సంఖ్యలో ఈ చెట్లు నాటించారు. ఇవి చాలా ఏపుగా పెరిగాయి. వీటికి పూలు రావడంతో సాయంత్రం, రాత్రి, ఉదయం సమయాల్లో వీటి నుంచి వికారంతో కూడిన దుర్వాసన వస్తోంది. రోడ్లపై రాకపోకలు సాగించే వారితో పాటు నివాసాలలో ఉన్న వారు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అనారోగ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయని వారు వాపోతున్నారు. వీటి వలన ప్రయోజనం కంటే నష్టాలే అధికంగా ఉన్నాయని పలువురు అంటున్నారు.

పట్టించుకోని అధికారులు

ఏడాకుల చెట్లతో శ్వాసకోశవ్యాధులు వస్తున్నా అధికారులు స్పందించడం లేదు. ఈ చెట్లను తొలగించాలని ఎప్పటి నుంచో ప్రజలు కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ప్రజల ఆరోగ్యానికి చేటుగా ఉన్న ఈ చెట్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం



హుద్‌హుద్ తర్వాత పచ్చదనం త్వరగా పెరగాలన్న భావనతో ఏడాకుల మొక్కలు విపరీతంగా నాటారు. పుష్పించే చెట్లు, వాటి పువ్వుల నుంచి వచ్చే గాలి పీల్చడం వలన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో కూడా అనేక ఫిర్యాదులు చేశాం. అప్పుడు చెట్ల కొమ్మలు పూర్తిగా కొట్టించి తాత్కాలిక చర్యలు చేపట్టే వారు.. ఇప్పుడు కనీసం పట్టించుకునే వారే లేరు.

–సుందర పార్వతి, చంద్రంపాలెం

ఎవరికి చెప్పుకోవాలి



ఏడాకుల చెట్లు ఉన్న చోట్ల ఉండలేని పరిస్థితి. మంచు పడితే వాటి నుంచి వచ్చే గాలి పీల్చితే వికారంగా ఉంటుంది. ఒక్కోసారి కడుపులో తిప్పేస్తుంది. ఇక అనారోగ్యంతో ఉన్న వారు, ఆస్మా, ఇతర గుండె జబ్బులు ఉన్నవారు మరింత ఇబ్బంది పడుతున్నారు. ఈ చెట్లు పూర్తి స్థాయిలో తొలగించాలి.

–పిళ్లా వెంకటరమణ, దుర్గానగర్, మధురవాడ

తొట్లకొండపై సీడ్ బాల్స్



కార్యక్రమంలో పాల్గొన్న డీఎఫ్‌వో శాంతి స్వరూప్, తదితరులు

కొమ్మాది: పర్యావరణ పరిరక్షణతో పాటు అడవులు విస్తారంగా పెరగాలనే ఉద్దేశ్యంతో వైజాగ్ రన్నర్స్ సంస్థతో కలిసి క్రెడాయ్ వైజాగ్ చాప్టర్ సభ్యులు ఆదివారం తొట్లకొండ పై నుంచి సీడ్ బాల్స్‌ను వేశారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో శాంతి స్వరూప్ మాట్లాడుతూ ఉష్ణోగ్రత పెరగకుండా వాతావరణ సమతుల్యత కోసం, ప్రజా శ్రేయస్సు దృష్టిలో పెట్టుకుని ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తతం చేయాల్సి ఉందని, క్రెడాయ్ కార్యక్రమాలను మిగతా సంస్థలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్రెడాయ్ సీఈవో జె.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి మరిడమ్మ ఉత్సవాలు

భీమునిపట్నం: భీమిలిలోని నాగవంశీయుల ఆరాధ్య దైవం మరిడమ్మవారి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నామని అమ్మవారి ఆలయ ధర్మకర్త గాడు అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం ఆలయం వద్ద నాగవంశ కులపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈనెల 21, 22, 23 తేదీల్లో ఉత్సవాలు జరుగుతాయని తొలేళ్లు, ఉత్సవ వేడుకలు ఎంతో వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. పెద్దలు కె.ముత్యాలరావు, కంటుభుక్త రామానాయుడు, లచ్చుబుగత గణపతి, రాంభుక్త ప్రభాకర్‌నాయుడు, గాడు అనంద్, సంకురుబోతు జోగారావు, కాళ్ల శ్రీనివాసరావు, గాడు సన్యాసినాయుడు, కనకల సన్నిబాబు, లచ్చుబుగత ఆదినారాయణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశం



చిట్టివలస జెడ్పీహైస్కూల్‌లో సమావేశమైన 1978-79 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం 1978–79 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమావేశం జరిగింది. 45 ఏళ్ల తరువాత కలుసుకున్న మిత్రులు భావోద్వేగాలకు గురయ్యారు. వీరిలో చాలా మంది వివిధ ఉద్యోగాలు చేస్తూ రిటైర్ అయినవారే కావడం గమనార్హం . ఉత్తరాంధ్రతో పాటు ఉభయగోదావరి, కృష్ణా, గంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన మిత్రులంతా కలిసి ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. తమతో చదువుకుంటూ భౌతికంగా తమ మధ్యలో లేని వారిని స్మరించుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. తరువాత వయసును మరిచి ఆట, పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పాట్నూరు మురళీమోహనరావు, పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల అధ్యక్షుడు డీవీ చలపతిరావు, ప్రధాన కార్యదర్శి కె.సన్యాసినాయుడు, కోశాధికారి పి.గోపాలరావు, సహాయ కార్యదర్శి పి.నాగరాజు, జి.సుగుణాకరరావు, బి.బంగార్రాజు, నమ్మి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలపై నిర్మాణాలు..రహదారిపై మురుగు



రహదారిపై మురుగునీరు


తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు సంతపేట గొల్లవీధి నుంచి ఆదర్శనగర్‌కు వెళ్లే రహదారిలో ఈఎస్ఐ ఆస్పత్రిని ఆనుకుని ఉన్న డ్రైనేజీ ఆక్రమణలకు గురైంది. పలువురు డ్రైనేజీని మూసివేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. దీంతో వర్షాలకు ఈ ప్రాంత రహదారులు చెత్తతోనూ, మురుగుతోనూ నిండిపోతున్నాయి. రెండు రోజుల క్రితం రాత్రివేళ కురిసిన భారీ వర్షానికి గొల్లవీధి, ఆదర్శనగర్ వీధులన్నీ మురుగు, చెత్తతో నిండిపోయాయి. తరువాత రోజు ఉదయం ఇద్దరు పారిశుధ్య సిబ్బంది పని చేసినా మురుగు, చెత్త సమస్య పూర్తిగా తొలగిపోలేదు. దీంతో స్థానికులు పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగించి మురుగు ముంపు బాధ నుంచి తమకు విముక్తి కలిగించాలని గొల్లవీధి, ఆదర్శనగర్ వాసులు కోరుతున్నారు.

కార్డుదారులందరికీ కందిపప్పు


సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: రెండు మూడు రోజుల్లో మిగిలిన కార్డుదారులకు కూడా కందిపప్పు పంపిణీ చేయనున్నట్టు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు. 'కొద్దిమందికే రేషన్ కందిపప్పు' శీర్షికతో ఈ నెల 5న సాక్షిలో ప్రచురించిన వార్తకు వారు స్పందించారు. ప్రస్తుతం ప్రభుత్వం కార్డుదారులకు బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు పంపిణీ చేయాలని నిర్ణయించిందన్నారు. జిల్లాకు 225 టన్నుల కందిపప్పు కేటాయించగా ఇప్పటి వరకు 114 టన్నులు ఎంఎల్‌సి పాయింట్ల నుంచి ఎఫ్‌పీ పాయింట్లు తరువాత ఎండీయూల ద్వారా క్లస్టర్ల వారీగా ముందుగా వచ్చిన వారికి ముందుగా పంపిణీ చేసినట్టు తెలిపారు. భీమిలి ఎంఎల్‌సీ పాయింట్లకు కేటాయించిన 39 టన్నులకు గాను 18 టన్నుల కందిపప్పు వచ్చిందన్నారు. జేసీ ఆదేశాల మేరకు అందరికీ కందిపప్పు అందేంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళల అదృశ్యం



అశ్విని



ఆదిలక్ష్మి(ఫైల్)

పీఎంపాలెం: మహిళ అదృశ్యంపై పీఎంపాలెం పోలీసు స్టేషన్ కేసు నమోదైంది. మధురవాడ శివ శక్తి నగర్‌లో తీడ శ్రీనివాసరావు.. భార్య అశ్విని (36) ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. అశ్విని ఈ నెల 3వ తేదీ దయం 11 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయింది. తిరిగి రాలేదు. చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేక పోవడంతో భర్త శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బాలకృష్ణ చెప్పారు.

తగరపువలస బైపాస్ రోడ్డు వద్ద

తగరపువలస: శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం అచ్యుతాపురానికి చెందిన వంటిపల్లి ఆదిలక్ష్మి (58) ఈ నెల 2వ తేదీన తగరపువలస బైపాస్ రోడ్డులో అదృశ్యమైంది. ఆమె కుమారుడు గోవిందరావు భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీలో పనిచేస్తూ జీవీఎంసీ పరిధి కొత్తపేటలో కుటుంబంతో నివశిస్తున్నాడు. గత బుధవారం ఉదయం ఆమె శ్రీకాకుళం జిల్లాలోని ఇంటికి వెళ్లడానికి గాను గోవిందరావు బైపాస్‌రోడ్డు వద్ద బస్సు కోసం వదిలి వచ్చాడు. సాయంత్రం అక్కడకు ఫోన్ చేయగా ఆదిలక్ష్మి చేరలేదని తెలిసింది. దీంతో ఆమె కుమారుడు భీమిలి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. హెచ్‌సీ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గీతంలో ముగిసిన జాతీయ సదస్సు



పాల్గొన్న ఆసియా ప్రాంత వైద్య సురక్షితా విభాగం అధిపతి కాంతి

కొమ్మాది: మందుల సురక్షిత వినియోగాన్ని నిర్ధారించడానికి సాంకేతిక ఆధారిత ఫార్మాకో విజిలెన్స్ కీలక పాత్ర పోషిస్తుందని ఐక్యూ వీఐఏ సంస్థ ఆసియా ప్రాంత వైద్య సురక్షిత విభాగం అధిపతి డా. కాంతి అన్నారు. గీతంలో జరుగుతు న్న ఆంధ్రప్రదేశ్ ఫార్మాకోలాజిస్టు సొసైటీ జాతీయ కాన్ఫరెన్స్ –2024 లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఫార్మాకో విజిలెన్స్ రంగం భవిష్యత్తులో కృత్రిమ మేధ సాంకేతికతను వినియోగించడం, యువతలో ప్రతిభను పెంపొందించడం ద్వారా రోగులకు ఉత్తమ సేవలు అందించవచ్చునన్నారు.

వింధ్య విలాసిని..వారాహి త్రిపురాంబికే..



కొత్త మూలకుద్దు మండపంలో..



లలితా త్రిపుర సుందరి దేవిగా పద్మావతి



అలంకరణలో దుర్గా మాత



మజ్జివలస ఎస్సీ కాలనీలో..



కారుషెడ్డు బబ్బేలమ్మ



ఆదర్శనగర్ మండపంలో ..



చిప్పాడలో శాకాంబరి అలంకరణలో ..



మజ్జివలస రెడ్డివీధి కూడలిలో అమ్మవారు



అమ్మ వారికి సారె సమర్పిస్తున్న భక్తులు



మోగదారమ్మ మహాలక్ష్మి ఆలయంలో నిర్వహిస్తున్న చండీ యాగంలో పాల్గొన్న భక్తులు

తగరపువలస: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజైన ఆదివారం అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పలు మండపాలు, ఆలయాలలో అమ్మవారికి ప్రీతిపాత్రమైన చండీహోమం, అన్నసమారాధనలు నిర్వహించారు. భీమిలి మండలం చిప్పాడలో ఉత్సవ కమిటీ అమ్మవారిని శాకాంబరిగా అలంకరించి భారీ అన్నసమారాధన సాయంత్రం వరకు నిర్వహించారు. టి.నగరపాలెం పంచాయతీ కొత్తూరులో కూడా ఉత్సవ కమిటీ నిర్వాహకులు అన్నదానం చేశారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో సంగివలస అమ్మవార్లకు కుంకుమపూజలు చేశారు. బైపాస్‌రోడ్డులోని విజయదుర్గ ఆలయం, కొండపేటలోని కనకదుర్గాంబిక ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎండాడ దుర్గమ్మ ఆలయంలో..

కొమ్మాది: దేవి నవరాత్రుల్లో భాగంగా ఎండాడలో గల దుర్గమ్మ ఆలయంలో నాల్గవరోజు లలితా మహా త్రిపుర సుందరిదేవిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించుకున్నారు. ఎండాడలో గల శ్రీ మోగదారమ్మ మహాలక్ష్మి ఆలయంలో చండీ యాగం నిర్వహించారు.

లలితా త్రిపుర సందరి దేవిగా అమ్మవారు

భీమునిపట్నం: భీమిలి కృష్ణాకాలనీ కొండపైన ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామివారు ఆలయంలో దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం పద్మావతి అమ్మవారు లలితా త్రిపుర సుందరి దేవి అలంకణలో భక్తులకు దర్శమిచ్చారు.

విజయ దుర్గా దేవికి సారే సమర్పణ

మధురవాడ: దసరాలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మధురవాడ టైలర్స్ కాలనీ విజయ దుర్గా దేవికి ఆదివారం భక్తులు సారె సమర్పించారు. కాలనీ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు ఘటాలు, వివిధ రకాలు పిండి వంటలు, పండ్లు,కాయలు, వస్త్రాలు, భాజా బజంత్రీలు, కోలాటం, భక్త వేశాలుతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని సారే సమర్పించారు. ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి విశేష అలంకరణ చేశారు. సాయంత్రం పుర వీధుల్లో అమ్మ వారి పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బంగారు సుబ్బారావు, లక్ష్మి ధర్మకర్తల మండలి సభ్యులు బంగారు అశోక్, ఝాన్సీ దంపతులు బంగారు ప్రకాశ్, తెంటు మాధవి, నవగాని శరత్, తెంటు భరన్, వట్టికుల నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో..

మధురవాడ: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 4వ రోజు చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారు భక్తులకు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనం ఇచ్చారు. అలాగే రేవళ్ల పాలెం భూలోక మాత ఆలయంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు.

రేపు పీఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా

తగరపువలస: ఆల్ ఇండియా కో ఆర్డినేటివ్ కమిటీ, రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఈ నెల 8న నగరంలోని మద్రిపాలెం పీఎఫ్ కార్యాలయం ముందు జరిగే ధర్నాకు పెన్షనర్లు అందరూ హాజరుకావాలని జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కె.దీనబంధు, ప్రధాన కార్యదర్శి షేక్ హుస్సేన్ కోరారు. ఆదివారం చిట్టివలస జ్యూట్ మిల్లు కల్యాణమండపంలో జరిగిన పెన్షనర్ల సమావేశంలో వారు మాట్లాడారు. పెన్షన్ల పెంపుదల కోసం ఇటీవల ఢిల్లీలో జరిగిన ధర్నా వివరాలు తెలియచేశారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి కేపీ కుమార్, చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మిక సంఘాల నుంచి దామోదల బాబాజీ, సింగిడి అప్పారావు, కాసూరి రాంబాబు, అల్లు బాబూరావు, కొండపు ఈశ్వర రావు, మునకాల ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగరతీరాలకు పర్యాటకుల తాకిడి



రుషికొండ బీచ్‌లో పర్యాటకుల సందడి

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకుల తాకిడి పెరిగింది. ఎండలు మండిపోతుండడంతో పర్యాటకులు బీచ్‌లకు క్యూ కడుతున్నారు. మరో వైపు దసరా సెలవులు కావడంతో ఆదివారం ఉదయం నుంచి రుషికొండ బీచ్, సాగర్‌నగర్ బీచ్, మంగమారిపేట బీచ్, భీమిలి బీచ్ ప్రాంతాల్లో పర్యాటకుల తాకిడి పెరిగింది. తొట్లకొండ, బావి కొండ, రామానాయుడు ఫిల్మ్ స్టూడియో వంటి పర్యాటక ప్రాంతాల్లో కూడా పర్యాటకుల తాకిడి కనిపించింది.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఘటాల ఊరేగింపు



తగరపువలసలో ఘటాలతో భవానీ భక్తులు

తగరపువలస: చిట్టివలస గణేష్ థియేటర్ కూడలిలోని శ్రీనవదుర్గా భవానీ పీఠం భక్తులు ఆదివారం సాయంత్రం ఘటాలతో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. వందలాది మంది భవానీలు ఘటాలపై దీపాలతో భీమిలి రోడ్డు, మెయిన్‌రోడ్డు, కొత్తపేట, సంతపేట, కార్మికవాడలో ఈ ఊరేగింపు నిర్వహించారు. గురుభవానీలు గురయ్యరెడ్డి, మహేష్, రాజాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.